## క్లుప్తంగా

### విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

కుప్పం రూరల్: మండలంలోని కుప్పం - మల్లానూరు రోడ్డుపై లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. రాగిమానుమిట్ట వద్ద లారీని డ్రైవర్ రివర్స్ తీసేందుకు ప్రయత్నించాడు. వెనుక వైపు ఉన్న విద్యుత్ స్తంభాన్ని గమనించపోవడంతో లారీ ఢీకొంది. విద్యుత్ తీగ లారీపై పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేక పోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభం విరిగిపోయింది. లారీ డ్రైవర్, క్లీనర్లు సురక్షితంగా బయటపడ్డారు.

### ప్రాజెక్టులోకి చేరుతున్న నీరు



సదుం: మండలంతోపాటు సోమల అటవీ ప్రాతంలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు జోరుగా ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో గార్గేయ నది ద్వారా కొర్లకుంవారిపల్లె ప్రాజెక్టులోకి నీరు చేరుతోంది. ఇప్పటికే 70 శాతం ప్రాజెక్టు నిండిందని గ్రామస్తులు తెలిపారు. ఇలాగే వర్షాలు పడితే కొద్ది రోజుల్లోనే ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండుతుందని చెప్పారు.

### మాజీ సర్పంచ్‌కు నివాళి



దక్షిణామూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పుంగనూరు: కరసపల్లె మాజీ సర్పంచ్ పి.దక్షిణామూర్తికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అనీషారెడ్డి, శ్రీనాథరెడ్డి, పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. పెద్దపంజాణి మండలం మాదనపల్లెలో శనివారం దక్షిణామూర్తి కర్మ క్రియలు నిర్వహించారు. ఇందులో వారు పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం కార్యదర్శి ఆర్‌కె.రామకృష్ణ, మాజీ సర్పంచ్ బత్తలాపురం రమణ, న్యాయవాది బాలాజీకుమార్ పాల్గొన్నారు.

### కమనీయం.. కోనేటి రాయుని కల్యాణం



గంగవరం: మండలంలోని కీలపట్లలో వున్న టీటీడీ అనుబంధ కోనేటిరాయస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రావణ మాసం శ్రవణా నక్షత్రం, పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత కోనేటిరాయస్వామిని విశేషంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు దేవరాజచార్యులు, శ్రీహర్ష దీక్షితులు పాల్గొన్నారు.

### కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

పుంగనూరు: పట్టణ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద శనివారం కారు ఢీకొనడంతో విద్యుత్ పనులు చేస్తున్న ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కార్మికులు మణికుమార్(30), అనంతకుమార్(30), చంద్ర(30) జగనన్న కాలనీ వద్ద విద్యుత్ పనులు చేస్తున్నారు. పట్టణానికి చెందిన ఒక వ్యక్తి కారులో వెళుతూ వారిని ఢీకొన్నాడు. గాయపడిన కార్మికులను స్థానికులు 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**లారీ ఢీకొని..**

పుంగనూరు పట్టణంలోని ఎన్ఎస్.పేట వద్ద గల ఓ కళ్యాణ మండపం సమీపంలో లారీ ఢీకొనడంతో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని వనమలదిన్నెకు చెందిన వనజ(47) నడుచుకుంటూ ఊరికి వెళ్తున్నారు. అదేసమయంలో అటుగా వెళుతున్న లారీ ఆమెను ఢీకొంది. ఎడమ కాలు లారీ చక్రాల కింద నలిగిపోయింది. ఆమెను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### శాస్త్రోక్తంగా సత్యనారాయణస్వామి వ్రతం

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్ లోని బ్రహ్మానందాశ్రమంలో శనివారం సత్యనారాయణస్వామి వ్రత పూజను వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణస్వామి మూల విగ్రహానికి ఆశ్రమ నిర్వాహకులు కేశవానంద స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని మండపంలో కొలువుదీర్చి స్వామివారి వ్రత పూజను నిర్వహించారు. వ్రతం మహత్యాన్ని వివరించారు. పెద్దసంఖ్యలో భక్తులు వ్రతంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

# పంటలకు వర్షం దెబ్బ

పలమనేరు నియోజకవర్గంలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. టమాటా, బీన్సు, మిరప, వంగ, చిక్కుడు, బీర, కాకర పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల రోడ్లు బురదమయమయ్యాయి. వర్షాలకు తోడు తీవ్రమైన చలిగాలులు వీస్తుండడంతో పట్టుపురుగుల పెంపకానికి తీవ్ర ఆటంకమేర్పడింది. మల్బరీ ఆకు వానకు తడిస్తే వాటిని పురుగులకు మేతగా వేయలేని పరిస్థితి నెలకొంది.

- పలమనేరు నియోజకవర్గంలో మూడు రోజులుగా భారీ వర్షం
- తోటల్లోనే కుళ్లిపోతున్న టమాటా, కూరగాయలు
- దెబ్బతిన్న గ్రామీణ ప్రాంతాల రోడ్లు
- ఇళ్ల నుంచి బయటకు రాని జనం





పలమనేరు సమీపంలో వర్షానికి దెబ్బతిన్న టమాటా

పలమనేరు: భారీ వర్షాలకు టమాటా పంట దెబ్బతింటోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 400 హెక్టార్లలో టమాటా సాగు చేశారు. ప్రస్తుతం కాయలు కోత దశలో వున్నాయి. ఈ క్రమంలో వర్షాలకు టమాటా కాయలపై మచ్చలు పడడంతో పాటు కుళ్లిపోతాయని రైతులు చెబుతున్నారు. కాయ రంగు కూడా మారుతుందని పేర్కొంటున్నారు. వాటిని వ్యాపారులు కొనడానికి మొగ్గు చూపరని వాపోతున్నారు. ఆరునెలలుగా టమాటా పంటకు ధరలేక తీవ్రంగా నష్టపోయామని, ఇప్పుడిప్పుడే ధర కొంత పెరిగిందని చెబుతున్నారు. ప్రస్తుతం బాక్సు ధర రూ.500లు దాటిందని వెల్లడిస్తున్నారు. ఈ తరుణంలో వర్షాల వల్ల కాయలు చేలల్లోనే కుళ్లిపోయే ప్రమాదం వుందని చెబుతున్నారు.

**ఇతర కూరగాయల పంటలకూ నష్టమే**

వర్షానికి బీన్సు, మిరప, వంగ, చిక్కుడు, తీగ పంటలైన బీర, కాకర తదితరాలు కూడా దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు. ఇటీవల పలు పండుగలు, శుభకార్యాలతో బంతీ, చామంతి లాంటి పూల పంటలకు ధరలు పెరిగాయని, వర్షం వల్ల పూల నాణ్యత తగ్గి ధరలు తగ్గిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టు పురుగుల పెంపకానికి ఆటంకం**

వర్షం కురుస్తుండడం, ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోవడం పట్టు పురుగుల పెంపకానికి ఆటంకంగా మారాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలమనేరు డివిజన్‌లో ఐదు వేల ఎకరాల్లో మల్బరీ పంట సాగవుతోంది. ప్రస్తుతం చందరీకల్లో వేసే పట్టు పురుగులు గూళ్లను అల్లాలంటే ఉష్ణోగ్రత 27 డిగ్రీల నుంచి 32 డిగ్రీల వరకు ఉండాలి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోయాయి. దీంతో పట్టు పురుగులు గూళ్లను అల్లలేకపోతున్నాయి. వర్షానికి మల్బరీ ఆకు తడిసిపోవడంతో ఇక వివిధ దశల్లో వున్న పట్టు పురుగులకు మేత అందించలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.



గూడు కట్టని పట్టుపురుగు

**భారీ వర్షానికి దెబ్బతిన్న రోడ్లు**

గంగవరం: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు రహదారులు గుంతలమయయ్యాయి. మండల కేంద్రమైన గంగవరంలోని చెన్నై- బెంగళూరు హైవేలో ఫ్లెఓవర్ బ్రిడ్జి వద్ద గుంతలు పడి నీరు నిలిచింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన కొందరు యువకులు ఆ గుంతల్లో మొక్కలు నాటి నిరసన తెలిపారు. మరోవైపు కీలపట్లకు వెళ్లే రోడ్డులోనూ పెద్ద ఎత్తున గుంతలు పడడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది.



ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన రోడ్డుపై పడ్డ గుంతల్లో మొక్కలు నాటుతున్న యువకులు

**గ్రామీణ రహదారులు అధ్వానం**

వర్షం కారణంగా పలు గ్రామాల రహదారులు బురదమయంగా మారాయి. గొల్లపల్లి నుంచి కల్లాడు మీదుగా మాదిగబండకు వెళ్లే రోడ్డులో వర్షపు నిలిచింది. తొప్పనపల్లి, పాతపేట, కేసీ పెంట రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మల్బరీ తోటలో నిలిచిన నీరు



మాదిగబండ మార్గంలో రోడ్డులో నిలిచిన నీరు

## నోటీస్ బోర్డు

### రేపు బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ

సదుం: మండలంలో సోమవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు పీఎల్ఆర్ బిల్డింగ్ ఎదురుగా ఉన్న ప్రదేశంలో, 10 గంటలకు చీకలచేను, 11 గంటలకు బూరగమందలో కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

### వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సదుం: మండలంలోని వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో శ్రావణ మాసం మూడో శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లె శ్రీవారిపాద క్షేత్రంలో స్వామికి అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చనలు, పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. బూరగమంద భూదేవి, శ్రీదేవీ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

### అధ్వానంగా బీఎస్ఎన్ఎల్ సేవలు

సదుం: మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ సేవలు అధ్వానంగా ఉన్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సరఫరా లేనప్పుడు సిగ్నల్స్ రావడం లేదని, కాల్స్ కట్ అయిపోతున్నట్లు వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో సిగ్నల్స్ లేక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. చాలా రోజులుగా ఈ పరిస్థితి ఇలాగే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



రొంపిచెర్ల పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రొంపిచెర్ల: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని రొంపిచెర్ల పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ తెలిపారు. ఆయన శనివారం పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు గర్భందాల్చినప్పటి నుంచి ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులు నాలుగో నెలలో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఆదివాసీలను ఆదుకోవాలి

పుంగనూరు: ఆదివాసీల సమస్యలు పరిష్కరించి, వారిని అన్ని విధాలా ఆదుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ కోరారు. ఆయన శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో సభ్యులతో సమావేశమయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెన్నరాయుడు, రామయ్య, గిరిధర్, హీరానాయక్, శంకర్‌నాయక్, రాజునాయక్, శివాజినాయక్, దేశానాయక్, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆదివాసీ దినోత్సవం

కుప్పం/రామకుప్పం: కుప్పం, రామకుప్పంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక నాయకులు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో పెద్ద ఎత్తున్న ఎన్‌జీహోం వరకు ర్యాలీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఆదివాసుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పీఎస్ మునిరత్నం, డా.సురేష్ బాబు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమావేశం



పూర్వపు విద్యార్థులతో ఉపాధ్యాయులు

సోమల(చౌడేపల్లి): సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదివిన వారు శనివారం సమావేశమయ్యారు. తాము చిన్న తనంలో తరగతి గదుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. స్నేహితులతో సరదాగా గడిపారు. హెచ్‌ఎం లోకేశ్వరి అధ్యక్షతన సమావేశం నిర్వహించి తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు వెంకటరమణ, అనసూయమ్మ, శంకర్‌రెడ్డి, క్రిష్ణమరాజు, జనార్ధన్‌రాజు, శివశంకర్‌ను సత్కరించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు, సైన్స్ ల్యాబ్ ఆధునీకరణకు రూ.50 వేలు అందజేశారు. పాఠశాల అభివృద్ధితో పాటు పేద విద్యార్థులకు చేయూత ఇస్తామని తెలిపారు.

## 16, 17 తేదీల్లో రాజనాలబండ తిరునాళ్ల



పూజలు చేస్తున్న అధికారులు, గ్రామస్తులు



తిరుణాళ్ల నిర్వహణపై చర్చిస్తున్న అధికారులు

- టీటీడీ సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్
- 13 గ్రామాల పెద్దలతో సమావేశం
- ఉత్సవాల ఏర్పాట్లపై చర్చ

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో సంప్రదాయం ప్రకారం శ్రావణమాసం చివరి శనివారం, ఆదివారం (16, 17 తేదీలు) తిరనాళ్లను నిర్వహించనున్నట్లు టీటీడీ సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం రాజనాలబండలో తిరునాళ్లకు అనుసంధానమైన 13 గ్రామాల ప్రజలు, గ్రామపెద్దలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో అత్యంత వైభవంగా తిరునాళ్లను నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా దేవరెద్దుల ఊరేగింపు, పోకుమాను బరుగుట, ఉట్లోత్సవం, పిల్లనగ్రోవులు, చెక్కభజన బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. తిరునాళ్లను విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు. అనంతరం ఆలయం వద్ద మేళతాళాల నడుమ గుడి చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేశారు. లక్ష్మీనరసింహస్వామి కొండ వైపునకు తిరిగి పూజలు చేశారు. ఇలా చేయడం పూర్వం నుంచి కొనసాగుతున్న ఆచారమని స్థానికులు, అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ భానుప్రసాద్, శ్రీహర్ష, గ్రామస్తులు మల్లికార్జునరెడ్డి, ఓబులేసు, ప్రభాకర్, వెంకటరెడ్డి, ఈశ్వరయ్య, గంగిరెడ్డి పాల్గొన్నారు.

### వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వి.కోట: పట్టణంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం హరినామ స్మరణతో దద్దరిల్లింది. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వర స్వామి జన్మించిన రోజు, శ్రావణ పౌర్ణమి కావడంతో ప్రత్యేక భజన బృందం సభ్యులు అఖండ భజన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య మాట్లాడుతూ దాదాపు 10 సంవత్సరాలుగా ప్రతి శనివారం భజన, అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఇందుకు పట్టణ ప్రముఖులు, భక్తులు, దాతలు చందాల రూపంలో ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారని తెలిపారు.

### సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లె: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి విజయ్‌చంద్ర తెలిపారు. ఆయన శనివారం జంగాలఅగ్రహారంలో ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా వుండవచ్చని తెలిపారు. పరిసరాల్లో నీరు నిల్వలు వుండకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, సర్పంచ్ విజయమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో రాఖీ పౌర్ణమి



సదుంలో రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

సదుం: మండలంలో శనివారం రాఖీ పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా పలువురు మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సదుంలో వున్న బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చెందిన సిస్టర్ జయంతి పలువురికి రాఖీ కట్టారు. మిఠాయిలు పంచిపెట్టారు.

## చంద్రబాబు మోసాలను ఎండగడదాం



సోమల మండలం 81 ఉప్పరపల్లెలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సోమల(చౌడేపల్లె): హామీలు అమలుచేయకుండా చంద్రబాబునాయుడు చేస్తున్న మోసాలను ఎండగడదామని ఎంపీపీ ఈశ్వరయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగాధర్ రాయల్ తెలిపారు. వారు శనివారం 81 ఉప్పరపల్లె, పొదలగుంట్లపల్లె, నడింపల్లె పంచాయతీల్లో బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలుచేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. కరెంటు బిల్లులు పెంచబోమని చెప్పి మూడుసార్లు పెంచి పేదల నడ్డి విరిచారని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి కొంతమందికే పథకాన్ని వర్తింపజేశారని విమర్శించారు. గత ప్రభుత్వం అర్హతే ప్రమాణికంగా పథకాలు అందజేసిందని, చంద్రబాబు ప్రభుత్వం తమ కార్యకర్తలకే పథకాలు ఇస్తోందని ఆరోపించారు. చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని నాయకులకు పిలుపునిచ్చారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు నాగేశ్వరరావు, మోహన్, పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి శీలం భాస్కర్, సర్పంచులు సిద్ధలమ్మ, వెంకటరమణ, జయరాం, వాటర్‌షెడ్ చైర్మన్ పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం ఘోర విఫలం



మిట్టమీదరాచపల్లెలో క్యూ ఆర్‌కోడ్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పులిచెర్ల(కల్లూరు): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా ఆరోపించారు. వారు శనివారం మిట్టమీదరాచపల్లెలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అలవికాని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడం చంద్రబాబునాయుడు నైజమన్నారు. ఏడాదికే కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రజావ్యతిరేకత వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడం ఒక్క వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ప్రజలు గుర్తించారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరి, రెడ్డీశ్వరరెడ్డి, హేమసుందరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, నాగరాజ ప్రసాద్, పోకల చంద్ర, నిరంజన్‌రెడ్డి, నాగిరెడ్డి, గోవర్ధన్, రమణారెడ్డి, గంగయ్య, కేశవరెడ్డి, శ్రీనివాసులు, చంద్రబాబు, సిద్ధయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా యజ్ఞోపవీత ధారణ



బైరెడ్డిపల్లె : యజ్ఞోపవీత ధారణలో గాండ్ల కులస్తులు

పలమనేరు/బైరెడ్డిపల్లె: పలమనేరు పట్టణంలోని శివాలయంలో శనివారం స్థానిక గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన పలువురు గాండ్ల కులస్తులు పాల్గొని నూతన యజ్ఞోపవీతం ధరించారు.

అదేవిధంగా బైరెడ్డిపల్లె మండలం శెట్టిపల్లె, పాతురు నత్తంలో గాండ్ల కులస్తులు సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. గాయిత్రీదేవికి కలశ స్థాపన చేసి పుణ్యాహవచనం చేశారు. యజ్ఞోపవీతాలకు పూజలు చేసి ధరించారు.

### వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నియామకం



యూత్ వింగ్ అధ్యక్షుడు కిశోర్ నాయుడు



గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఆనంద

గంగవరం: వైఎస్సార్‌సీపీ గంగవరం మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. యువత విభాగం అధ్యక్షుడిగా కిశోర్‌నాయుడు, మహిళా విభాగానికి భారతి రెడ్డి, రైతు విభాగానికి వేణుగోపాల్ రెడ్డి, బీసీసెల్‌కు ప్రభాకర్, ఎస్సీసెల్‌కు బద్రీ, ఎస్టీ సెల్‌కు గంగులమ్మ, మైనారిటీ సెల్‌కు రెహమాన్, స్టూడెంట్ వింగ్‌కు పృథ్వీరాజ్, పీఆర్ వింగ్‌కు రమేష్‌రెడ్డి, ఆర్‌టీఐ వింగ్‌కు మహేష్, వలంటీర్ల వింగ్‌కు మధు, గ్రీవెన్స్ సెల్‌కు ఆనంద, వాణిజ్యానికి కరీంసాబ్, వైఎస్సార్‌టీయూసీకి భాస్కర్‌రెడ్డి, కల్చరల్‌కు విజయకుమార్, లీగల్ సెల్‌కు మోహన్‌రెడ్డి, సోషల్ మీడియా వింగ్‌కు గణేష్, ఐటీ విభాగానికి చలపతి, వైద్యుల విభాగానికి భాస్కర్, మేధావుల ఫోరానికి వెంకటరమణ నాయుడు, ప్రచార విభాగానికి అనిల్‌కుమార్, బూత్ కమిటీలకు శ్రీనివాసులు నియమితులయ్యారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. తమకు పదవులు వచ్చేందుకు కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.